కొత్త సంవత్సరంలో
జిల్లాను ముందంజలో నిలుపుదాం

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

కంఠేశ్వర్, జనవరి 2: నూతన సం వత్సరంలో జిల్లా మరింత ప్రగతి సాధించాలని, జిల్లాను ముందంజలో నిలిపేందుకు కృషి చేద్దామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అ న్నారు. అందుకు ప్రతిఒక్కరూ స హకరించాలని ఆయన ఆకాంక్షించారు. సమీకృత జిల్లా కార్యాలయా ల సముదాయంలోని కలెక్టరేట్ చాంబర్‌లో పలు శాఖల అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు వివిధ సంఘాల బాధ్యులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు కలెక్టర్‌ను గురువారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆఫీసర్స్ క్లబ్ బాధ్యులు, రెడ్‌క్రాస్ సొసైటీ, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, బ్రహ్మకుమారీలు కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు, పలు సంఘాల బాధ్యులు, ఇతరులు.. కలెక్టర్‌కు దుప్పట్లు, నోట్ బుక్కులు, పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. వాటిని సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు అందజేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఎమ్మెల్సీ కవితతోనే నిజామాబాద్ అభివృద్ధి

● ప్రజల అవసరాల మేరకు సౌకర్యాలు కల్పించారు ● నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి

ఖలీల్‌వాడి, జనవరి 2: ఎమ్మెల్సీ కవిత(నిజామాబాద్ మాజీ ఎంపీ)తోనే నిజామాబాద్ ఎంతో అభివృద్ధి చెందిందని నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నగర అభివృద్ధికి సంబంధించి ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కవిత ఎంపీగా ఉన్న సమయంలో నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.వంద కోట్లు ఇప్పించి, సుందరీకరణగా తీర్చి దిద్దారని తెలిపారు. పెద్దపల్లి– కరీంనగర్, నిజామాబాద్ 178కిలోమీటర్ల మేర రైల్వే లైన్ కోసం 2014–19 మధ్య కాలంలో రూ.500కోట్లు తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఎల్కట్టిక్ లైన్ కోసం రూ.85కోట్లు కేటాయించారని, మన్మాడ్ టు డోన్ ఎల్కట్టిక్ లైన్ కోసం ప్రతిపాదనలు పెట్టారని తెలిపారు. మిషన్ కాకతీయ ద్వారా రూ.348కోట్లతో లక్ష ఎకరాల స్థిరీకరణ జరిగిందని, రూ.269కోట్లతో 47 చెక్ డ్యాములను నిర్మించారని, రూ.149కోట్లతో రెండు లక్షల ఎకరాల ఆయకట్టు కోసం నిజాంసాగర్ కెనాల్ ఆధునీకరణ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. వాటితో పాటు గుత్ప, అలీసాగర్, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి, మునిపల్లి, ఫత్తేపూర్, చిట్టాపూర్, సుర్బిర్యాల్ లిఫ్ట్ పనులకు, ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకానికి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. రూ.50కోట్లతో ఐటీ హబ్ ఏర్పాటు చేయించి ఉద్యోగాలు కల్పించారని, వేల్పూర్ మండలం పడిగెల్‌లో స్పైస్ పార్కు ఏర్పాటుకు రూ.42కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. లెదర్ పార్కుకు రూ.పది కోట్లు కేటాయించగా.. భూసేకరణ జరుగుతున్నదని, రూ.109కోట్లతో లక్కంపల్లి సెజ్ పార్కు నిర్మించారని తెలిపారు. ఎంపీ కవిత చొరవతోనే మాధవ్‌నగర్ ఆర్వోబీకి రూ.63కోట్లు, నగరంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.21కోట్ల నిధులు కేటాయించారని పేర్కొన్నారు. కేవలం నగర అభివృద్ధి కోసమే రూ.వంద కోట్లు కేటాయించి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో అభివృద్ధి చేసిందని తెలిపారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం ఏడాది క్రితం కేటాయించిన నిధులను రద్దు చేసి, కొత్తగా తాము నిధులు తెచ్చామని కాంగ్రెస్ నాయకులు గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. కవిత ఎంపీగా ఉన్న సమయంలో అభివృద్ధి జరగలేదని కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం విడ్డూరంగా ఉన్నదని తెలిపారు.

26 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

వినాయక్‌నగర్, జనవరి 2: నిజామాబాద్ నగరంలో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలో పట్టుబడిన 26మందిపై కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ గురువారం తెలిపారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ఎదుట హాజరు పర్చామని తెలిపారు. వారికి రూ.41వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఇందల్వాయి, జనవరి 2: మండలంలో 14మందికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నవీన్‌గౌడ్ ఆధ్వర్యంలో బాధితులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దశరథ్, సాగునీటి సంఘం మాజీ చైర్మన్ గట్టు కడారితోపాటు నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులు, యాచకులకు దుప్పట్లు పంపిణీ

రుద్రూర్, జనవరి 2: అమ్మనాన్న చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రుద్రూర్‌లోని శ్రీవీరభద్ర స్వామి ఆలయం వద్ద వృద్ధులు, యాచకులకు ట్రస్ట్ చైర్మన్ ఏలూరి శ్రీనివాస్, సభ్యులు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు శ్యామల, రత్నవేణి, ప్రతిమ, విష్ణు, శ్రీవీరభద్ర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ మేక వెంకన్న, మాజీ సర్పంచ్ ఇందూరి చంద్రశేఖర్, ఆలయ పూజారులు శివప్ప, యువరాజ్ అప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గ్లాసులు, మ్యాట్లు ..

రుద్రూర్, జనవరి 2: వర్ని మండల కేంద్రంలోని వడ్డేపల్లి గ్రామ ఎంపీసీఎస్ విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ వర్ని ఆధ్వర్యంలో గ్లాసులు, మ్యాట్లు గురువారం అందజేశారు. విద్యార్థులకు రాగి జావ తాగడానికి 50 గ్లాసులు, కూర్చోవడానికి మ్యాట్లు అదజేసినట్లు లయన్స్ క్లబ్ వర్ని అధ్యక్షుడు కేఆర్ఎన్ తాగూర్(సీసీడీ) తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ జె.శ్రీనివాస్, ట్రెజరర్ శివరాజ్, ఎంఈవో సాయిలు, హెచ్ఎం మాధవి, శ్రీనగర్ పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్‌తోపాటు సుబ్బారావు, సాయిబాబు, కృష్ణ, విఠల్ విద్యార్థులు పాల్గొన్నారు.

పోష్టికాహారం తీసుకోవాలి

ధర్పల్లి, జనవరి 2: గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని ప్రతిరోజూ తీసుకోవాలని ధర్పల్లి గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ సూచించారు. అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న పోషకాహారంపై ఆయన గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చైనా మాంజాలను వాడొద్దు

మోస్రాలోని ఓ దుకాణంలో అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ అధికారులు

మోస్రా (చందూర్), జనవరి 2: గాలిపటాలను ఎగురవేసేందుకు చైనా మాంజాలను వాడొద్దని అటవీశాఖ అధికారులు ప్రజలకు సూచించారు. మోస్రాలో గురువారం అవగాహన సదస్సును నిర్వహించారు. చైనా మాంజాతో పక్షులు, జంతువులు, మానవాళికి ప్రమాదాలు జరుగుతాయని తెలిపారు. చైనా మంజా విక్రయించినట్లు తెలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ భవనం ఏర్పాటుచేయాలని వినతి

సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీనియర్ సిటిజన్లు

పాతంగల్, జనవరి 2: మండల కేంద్రంలో సీనియర్ సిటిజన్స్, పెన్షనర్ల భవనం ఏర్పాటు చేయాలని కోరుతూ బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు సీనియర్ సిటిజన్లు గురువారం వినతిపత్రం అందజేశారు. మండలంలో ఉన్న సీనియర్ సిటిజన్లు, పెన్షనర్లు వయో భారంతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పంచాయతీ రాజ్ శాఖ భవనాన్ని కేటాయిస్తే, రిపేరు చేయించుకొని వినియోగించుకుటామని సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండలంలోని సీనియర్ సిటిజన్లు, పెన్షనర్లు పాల్గొన్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్ల ఆవిష్కరణ

బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న టీయూ వీసీ యాదగిరిరావు

డిచ్‌పల్లి, జనవరి 2: డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ వర్క్ ఆధ్వర్యంలో తెలంగాణ యూనివర్సిటీలో ఫిబ్రవరి 21, 22వ తేదీల్లో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్లను టీయూ వీసీ యాదగిరిరావు గురువారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. సదస్సుకు పలు రంగాల నిపుణులు హాజరై తమ ప్రసంగాలను పరిశోధన విద్యార్థులకు వివరిస్తారని జాతీయ సదస్సు కన్వీనర్ డాక్టర్ వీరభద్రం, కో–కన్వీనర్లు డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ అంజయ్య తెలిపారు. సదస్సును తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, ఐసీఎస్ఎస్ఆర్ సౌత్ సెంట్రల్ రీజియన్ సహకారంతో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరితోపాటు ప్రొఫెసర్లు జి.చంద్రశేఖర్, అరుణ, హారతి, రాజేశ్వరి, డాక్టర్ అంజయ్య, సహాయ ఆచార్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

షాపింగ్‌మాల్స్‌లో తనిఖీలు

కంఠేశ్వర్, జనవరి 2: నగరంలోని పలు షాపింగ్‌మాల్స్‌లో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. నగరంలోని సౌత్ ఇండియా, చెన్నై షాపింగ్ మాల్స్‌లో తనిఖీలు నిర్వహించిన మున్సిపల్ అధికారులు.. ప్రాపర్టీ ట్యాక్స్, ట్రేడ్ లైసెన్స్, శానిటేషన్‌కు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. తనిఖీల్లో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

సిరికొండ, జనవరి 2: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని తహసీల్దార్ రవీందర్‌రావు అన్నారు. మండలంలోని మైలారం గ్రామ ప్రభుత్వ పాఠశాలను ఆయన గురువారం సందర్శించి, హాజరు పట్టికలు, వంట గదిని తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు.

సీజ్ చేసిన బైక్ మాయం!

ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ముందు నుంచి చోరీ

వినాయక్‌నగర్, జనవరి 2: వాహనాల తనిఖీల్లో ట్రాఫిక్ పోలీసులు సీజ్ వాహనం చోరీకి గురికావడంతో బాధితుడు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీజ్ వాహనం ట్రాఫిక్ పోలీసుస్టేషన్ నుంచి అపహరణకు గురికావడం విస్మయానికి గురిచేసింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూడగా..ఇందుకు సంబంధించిన వివరాలు.. వారం రోజుల క్రితం నిజామాబాద్ ట్రాఫిక్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టగా.. రూరల్ మండలంలోని తిర్మన్ పల్లి గ్రామానికి చెందిన బైరి నాగరాజు అనే వ్యక్తి ట్రిబుల్ రైడింగ్ వెళ్తుండగా పట్టుకుని కేసు నమోదు చేశారు. అనంతరం నాగరాజుని కోర్టుకు తరలించగా అక్కడ జరిమానా విధించారు. జరిమానా చెల్లించడానికి డబ్బులు లేకపోవడంతో తర్వాత చెల్లించి, తన బైక్‌ను తీసుకెళ్తానని వెళ్లిపోయాడు. నాగరాజు డిసెంబర్ 31న ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు వచ్చి, తన బైక్ ఎక్కడ ఉందని అడుగగా ఎవరూ సరైన సమాచారం ఇవ్వలేదు. దీంతో తన వాహనం చోరీకి గురైనట్లు తెలుసుకొని వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేసిన తన బైక్ చోరీకి గురైందని మంగళవారం సాయంత్రం తమకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి వెల్లడించారు.

నేడు బెటాలియన్‌లో పాసింగ్ అవుట్ పరేడ్

డిచ్‌పల్లి, జనవరి 2: తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ 7వ బెటాలియన్‌లో నేడు (శుక్రవారం) పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహించనున్నట్లు బెటాలియన్ కమాండెంట్ సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బెటాలియన్‌లో తొమ్మిది నెలలపాటు కమాండో తరహా శిక్షణను పూర్తి చేసుకుని వివిధ పోలీస్‌స్టేషన్లలో ఉద్యోగ బాధ్యతను నిర్వహించేందుకు వెళ్తున్న వారి నుంచి ముఖ్య అతిథిగా హాజరయ్యే ఇన్‌చార్జి సీపీ సింధూ శర్మ గౌరవ వందనం స్వీకరిస్తారని పేర్కొన్నారు. అనంతరం వారికి సర్టిఫికెట్లు అందజేసి, విధులకు సంబంధించిన సూచనలు, సలహాలు అందజేస్తారని తెలిపారు. పరేడ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమాండెంట్ వివరించారు.

ఆలయ భూముల సర్వే

సర్వే నిర్వహిస్తున్న అధికారులు

సుభాష్‌నగర్, జనవరి 2: జిల్లా కేంద్రంలోని బడా రాంమందిర్, సారంగాపూర్ హనుమాన్ ఆలయాలకు చెందిన వ్యవసాయ భూముల హద్దులు నిర్ణయించేందుకు ఉత్తర విభాగం సర్వేయర్ ఎంఏ. సయీద్, జిల్లా దేవాదాయ ధర్మదాయశాఖ సంయుక్త అధ్వర్యంలో గురువారం సర్వే చేపట్టారు. న్యాల్‌కల్‌రోడ్ బస్‌డిపో వెనక సర్వేనంబర్ 1491లో 4ఎకరాల 28 గుంటలు, 1492లో ఒక ఎకరం 8గుంటలు, 1495లో ఒక ఎకరం 25గుంటలు, 1496లో ఎకరం 36 గుంటల వ్యవసాయ భూములకు సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జి సహాయ కమిషనర్ శ్రీరాం రవీందర్‌గుప్తా, పరిశీలకురాలు కమల, ఫిట్ పర్సన్ అధికారి జి.వేణు, జూనియర్ అసిస్టెంట్లు ప్రశాంత్‌కుమార్, ఆంజనేయులు, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జడ్జికి కొత్త సంవత్సర శుభాకాంక్షలు

వినాయక్‌నగర్Iఆర్మూర్‌టౌన్, జనవరి 2: జిల్లా జడ్జి సునీత కుంచాలను నిజామాబాద్ బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు మొక్కను అందజేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జడ్జిని కలిసిన వారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్, కార్యవర్గ సభ్యులు రాజు,వసంత్ రావు, సురేశ్, దీపక్ ఉన్నారు. అనంతరం ఆర్మూర్ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది రాజ్‌వీర్ మృతికి సంతాపం వ్యక్తంచేస్తూ తీర్మానం చేశారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. జిల్లా జడ్జి సునీత కుంచాలను నిజామాబాద్ కోర్టు కార్యాలయంలో ఆర్మూర్ బార్ అసోసియేషన్ సభ్యులు కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ సభ్యులు తెడ్డు నర్సయ్య, పోడేటి శంకర్, దేవర శెట్టి అరుణ్ కుమార్, తుమ్మ సుకేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ కాల్వను రక్షించాలి

మాక్లూర్, జనవరి2: మండలంలోని దాస్‌నగర్ నుంచి మానిక్‌బండార్ లోని పులాంగ్ వాగు వరకు నిజాంసాగర్ డిస్ట్రిబ్యూటర్–68 కాల్వ కబ్జాలకు గురైందని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సర్వే చేసి కాపాడాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు దుడ్డు గంగాధర్ అన్నారు. మానిక్‌బండర్‌లో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ మానిక్‌బండార్, బోర్గాం(కె) గ్రామాల్లోని చెరువులకు సాగునీరందించే కాల్వలు కబ్జాకు గురయ్యాయని అన్నారు. అధికారులు జాయింట్ సర్వే చేయలాని కోరారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

డిచ్‌పల్లి, జనవరి 2: తెలంగాణ యూనివర్సిటీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను టీయూ వీసీ యాదగిరిరావు గురువారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ హారతి, ఆడిట్ సెల్ డైరెక్టర్ గంట చంద్రశేఖర్, అరుణ, ఆంజనేయులు, లావణ్య, అపర్ణ, రాంబాబు, డాక్టర్ సత్యనారాయణ, ఐలేని మహేందర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయాగౌడ్, సూపరింటెండెంట్ భాస్కర్, ఇంజినీర్ వినోద్‌కుమార్, వార్డెన్ కిరణ్‌రాథోడ్, గంగాకిషన్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

బోధన్ ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

శక్కర్‌నగర్/ డిచ్‌పల్లి/ ఆర్మూర్‌టౌన్/ భీమ్‌గల్, జనవరి 2: కుదిరిన ఒప్పందం మేరకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం బోధన్ పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్ ఎదుట సివిల్ సప్లయిస్ హమాలీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు గోదాంకు తాళం వేసి మోకాళ్లపై నిలబడి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ సివిల్ సప్లయిస్‌శాఖ రాష్ట్ర కమిషనర్‌తో గతంలో చర్చలు జరిగాయని అయినా తమకు న్యాయం జరగడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన రేట్ల ప్రకారం క్వింటాల్‌కు రూ.29 చెల్లించాలని, కార్మికులు, స్వీపర్లకు రూ.10 లక్షల ఆరోగ్యబీమా చెల్లించాలని డిమాండ్ చేశారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలో హమాలీల సమ్మె రెండో రోజు కొనసాగింది. హమాలీలు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగుతుందన్నారు. ఆర్మూర్ సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమ్మెకు దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) ఆర్మూర్ డివిజన్ కమిటీ కార్యదర్శి మాధరి నరేశ్ మద్దతు తెలిపారు. ఆర్మూర్ మార్కెట్ యార్డులో హమాలీలు నిర్వహిస్తున్న సమ్మె రెండో రోజుకు చేరింది. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు అరెపల్లి సాయిలు, మౌలనా, శ్రీను, ఫెరోజ్, రహీమ్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు. భీమ్‌గల్‌లో మండలంలోని బాబానగర్ గోదాం వద్ద రెండో రోజు కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. సమ్మె చేస్తున్న హమాలీలకుసీపీఐఎంఎల్ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సమ్మె చేస్తున్న హమాలీలు రాజన్న, పోశెట్టి, శేఖర్, తుకారాం, అనంత్, ఫయాజ్, రాహుల్, హరీశ్‌కు మద్దతు తెలిపారు.

వరిలో తడిపొడి సాగుపై అవగాహన

మోర్తాడ్, జనవరి 2: కమ్మర్‌పల్లి మండలం నర్సాపూర్ గ్రామంలో గురువారం రైతులకు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరిలో తడిపొడి సాగుపై అవగాహన కల్పించారు. ఏవో రమ్యశ్రీ మాట్లాడుతూ.. తడి, పొడి పద్ధతి సాగుతో నీరు ఆదా అవుతుందని అన్నారు. ఏఈవో శ్యామ్, రెడ్డీస్ ఫౌండేషన్ కమ్యూనిటీ ఫెసిలిటేటర్ చింత శ్రీనివాస్, నోముల మహేందర్, రైతులు సంజీవ్, రమేశ్, ఎర్రన్న, ప్రవీణ్, లింబన్న పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న అధికారులు

బోధన్, జనవరి 2: పట్టణ శివారులోని బెల్లాల్ విద్యుత్ కార్యాలయంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సంస్థ నిజామాబాద్ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని బోధన్ అదనపు ఐడీ జిల్లా న్యాయమూర్తి ఎస్. రవికుమార్ ప్రారంభించారు. ట్రాన్స్‌కో ఎస్ఈ(ఆపరేషన్) రవీందర్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ వారు తలసేమియా బాధితులకు అందిస్తున్న సాయానికి గాను తమవంతుగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి సహకరిస్తున్నామన్నారు. 34వ సారి రక్తదానం చేసిన బోధన్ ఏఈ నాయిని కృష్ణను అధికారులు అభినందించారు. రక్తదానం శిబిరంలో విద్యుత్‌శాఖ ఉద్యోగులు 56 యూనిట్ల రక్తదానం చేశారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈ ముక్తార్, ఏఏవో శివాజీ గణేశ్, రెడ్‌క్రాస్ చైర్మన్ బుస్సా ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏడీఈ తోట రాజశేఖర్, బసవేశ్వర్ రావు, ఏడీఈలు నాగేశ్ కుమార్, ప్రభాకర్, ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్, బోధన్ విద్యుత్ ఉద్యోగ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలకు వంట సామగ్రి, స్పీకర్ల వితరణ

ఆర్మూర్‌టౌన్, జనవరి2: మండలంలోని అంకాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలకు గడ్డం రాజరెడ్డి జ్ఞాపకార్థం వంట సామగ్రి, స్పీకర్లను గురువారం గడ్డం రమేశ్‌రెడ్డి వితరణ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

కరపత్రాల ఆవిష్కరణ

బాల్కొండ/భీమ్‌గల్, జనవరి 2: బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఈనెల8న ఇందిరాపార్కు వద్ద నిర్వహించే బీసీ విద్యార్థుల సమర శంఖారావం కరపత్రాలను బీసీ విద్యార్థి సంఘం జిల్లా జనరల్ సెక్రటరీ ద్యాగ శేఖర్ పటేల్ భీమ్‌గల్ ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీసీ గురుకులాలకు సంక్షేమ వసతిగృహాలకు సొంత భవనాలు నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. బీసీలకు ప్రైవేట్ యూనివర్సిటీల్లో రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించనున్న సభకు బీసీ విద్యార్థి నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మనోహర్, మహేశ్, రుచిత్, కార్తీక్, నితిన్, భార్గవ్, భారత్, రిషిత, వరుణ్, సందేశ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

నవీపేట, జనవరి 2: మండలంలోని కమలాపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం తహసీల్దార్ వెంకటరమణ తనిఖీ చేశారు. చిన్నారులకు అందిస్తున్న ఆహారంలో నాణ్యతను పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్‌ను పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నందిపేట్, జనవరి2: మాయాపూర్ గ్రామశివారులో గురువారం పేకాటస్థావరంపై దాడి చేసి పేకాడుతున్న తొమ్మిది మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.9,500 నగదు, 8 సెల్‌ఫోన్లు, 8 బైకులను స్వాధీనం చేసుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మాక్లూర్, జనవరి2: మండలంలోని మహాత్మ జ్యోతిబా పూలే బాలికల పాఠశాలలో 2025 యేడాదికి గానూ 5వ తరగతిలో ప్రవేశాలనికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ స్వప్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కామన్ ఎంట్రన్స్ టెస్టు ద్వారా ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ముగిసిన క్రిస్మస్ ఫెస్టివల్ టోర్నీ

బహుమతులను అందజేస్తున్న అతిథులు

మాక్లూర్, జనవరి 2: మండలంలోని మెట్టు గ్రామంలో నిర్వహించిన 38వ క్రిస్మస్ ఫెస్టివల్ టోర్నీ బుధవారం రాత్రి ముగిసినట్లు ప్రసాద్‌రాజు తెలిపారు. వాలీబాల్‌లో జీజీనడ్కుడ గ్రామం మొదటి బహుమతి, ద్వితీయ బహుమతిని మైలారం, కబడ్డీలో మొదటి బహుమతి మల్లారం, ద్వితీయ బహుమతిని క్రీస్తునగర్, క్రికెట్‌లో మొదటి బహుమతి క్రీస్తునగర్ (ఎ), ద్వితీయ బహుమతి క్రీస్తునగర్(బి) గెలుపొందాయి. క్యారంబోర్డు, చెస్, షటిల్, టెన్నికాయిట్, టగ్ ఆఫ్ వార్, చిన్న పిల్లలకు మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పోర్ట్స్, రన్నింగ్ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

'మా భూములు మాకు ఇప్పించండి'

గతంలో ప్రభుత్వం అందజేసిన పట్టాలను చూపిస్తున్న బాధితులు

శక్కర్‌నగర్, జనవరి 2: రోడ్ల విస్తరణలో భాగంగా తాము కోల్పోయిన భూములకు బదులు ప్రభుత్వం తమకు అందజేసిన స్థలాలను ఇతరులు ఆక్రమించుకున్నారని పలువురు బాధితులు బోధన్ సబ్ కలెక్టర్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ 15 ఏండ్ల క్రితం రోడ్డు విస్తరణలో భాగంగా పాత బస్టాండ్ నుంచి పోస్టాఫీస్ వరకు సుమారు 125 మందికి పైగా ఇండ్లను కోల్పోయామన్న